28న మహా చండీహోమం

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్ ఫేజ్ 1 కల్యాణ తిరుపతి దేవస్థానంలో దేవి శరన్నవ రాత్రి మహోత్సవంలో భాగంగా 28న మహా చండీహోమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. హోమం చేయించదలచిన వారు ముందుగా రూ. 1000 చెల్లించి ముందుగానే పేరు నమోదు చేసుకోవాలని, సంప్రదాయ దుస్తులు ధరించి హోమంలో పాల్గొనాలని తెలిపారు.

స్క్రాప్ వాహనాల వేలం వాయిదా

సుభాష్‌నగర్: దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో కాలం చెల్లిన నాలుగు పాత స్క్రాప్ వాహనాల వేలం ఈ నెల 27న ఉండగా కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు అకాడమీ డైరెక్టర్ డా. ఆశ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు గమనించాలని కోరారు. తదుపరి జరగబోయే వేలం పాట తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

చిన్నారులకు పూజలు


శ్రీ కాత్యాయని దేవి అవతారంలో భాగంగా 9 మంది చిన్నారులు

సుభాష్‌నగర్: దసరా నవరోత్సవాలలో భాగంగా ఇంటింటా పండుగ శోభ నెలకొంది. ఉదయం నుంచే సంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులలో భాగంగా ఏదైనా ఒక రోజు 9 మంది చిన్నారులకు తొమ్మిది సంప్రదాయ వస్తువుల బహూకరణ చేస్తే అమ్మవారి ఆశిస్సులు ఉంటాయని భక్తుల నమ్మకం. ఇలా చాలా ఇంటింటా పంపిణీ చేస్తున్నారు.


విద్యుత్ అధికారుల బస్తీబాట

దుండిగల్: విద్యుత్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని మేడ్చల్ విద్యుత్ డీఈ శ్రీనివాసులు, ఏడీఈ వీరేశం లింగం అన్నారు. బస్తీబాటలో భాగంగా గురువారం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని డీపోచంపల్లి, సాయి పూజా కాలనీ, మల్లికార్జున్ నగర్, చంద్ర శేఖర్‌రెడ్డి నగర్ కాలనీలలో పర్యటించి స్థానికంగా నెలకొన్నలో ఓల్టేజీ, ఇతర విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్రీఫేజ్ లైన్ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. గృహ యజమానులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్ నాగబాబు, స్థానికులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు

ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

- ఇంట్లో ఆభరణాలు, నగదు పెట్టొద్దు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



జీడిమెట్ల: పండగలకు ఊళ్లకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగల బారి నుంచి తప్పించుకోవచ్చు. దొంగకు దొంగతనం చేసేందుకు ఏ ఒక్క ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఊర్లెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి అన్నారు.

- తప్పనిసరిగా ఇంటి ముందు నాణ్యత కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుకోవాలి. కెమెరా తప్పనిసరిగా బయటకు కనిపించేలా ఉండాలి.
- మన ఇంటి సీసీ కెమెరాల ఫుటేజీ మన సెల్‌ఫోన్‌లో వచ్చేలా ఇంటర్నెట్‌కు అనుసంధానం చేసుకోవాలి. తరచుగా సీసీ కెమెరా రికార్డింగ్ మన సెల్‌ఫోన్‌లో చెక్ చేసుకుంటూ ఉండాలి. ఏదైన అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో బంగారం, నగదు ఉంటే తప్పనిసరిగా బ్యాంకులో డిపాజిట్ చేసుకోవడం, లాకర్‌లలో భద్రపర్చడం మంచింది.
- మనం ఇంటికి సంబంధించిన అర్థిక విషయాలను తెలిసినవారికి సైతం తెలపకుండా జాగ్రత్త పడాలి. ఇంటిలోని ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- దొంగతనం చేసే ముందు దొంగ తప్పనిసరిగా రక్కీ నిర్వహిస్తాడు కాబట్టి మన ఇంటి గేటుకు తాళం లోపలి నుంచి వేయాలి. ప్రధాన ద్వారానికి లోపలి నుంచి గడియపెట్టి రెండో వైపునకు ఉన్న డోర్‌కు తాళం వేయాలి.
- వీలైతే ఇంటి ప్రధాన ద్వారానికి ఎలక్ట్రానిక్, సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి.
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కార్లలో ఉంచకూడదు. ద్విచక్ర వాహనాలను రోడ్లలో కాకుండా ఇళ్లలోపల పార్కింగ్ చేసుకోవాలి.
- మనం న్యూస్‌పేపర్, పాలప్యాకెట్లు వేయించుకున్నట్లైతే పేపర్, పాల వారికి ముందుగానే సమాచారం ఇచ్చి వేయవద్దని చెప్పాలి.
- ఒకవేళ ఇంట్లో డబ్బు, బంగారం ఉంచినట్లయితే బీరువాలో మాత్రం పెట్టకుండా దొంగ ఆలోచనకు దొరకని జాగాలో వాటిని దాయాలి. బీరువా తాళాలు బీరువాపైన, పరుపుల కింద పెట్టకుండా వాటిని జాగ్రత్తగా దాయాలి.
- ఊరెళ్తున్న విషయాన్ని ఇంటి పక్క వారికి గాని, పక్కింటి వారికి విషయాన్ని తెలియజేయాలి.
- రద్దీలో ఉన్న బస్సులో ప్రయాణిస్తున్నపుడు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలి. బస్సులో బ్యాగులు ఎక్కడో పెట్టి ఆదమరిచి ఉండకూడదు.
- నమ్మకమైన సెక్యూరిటీగార్డులు, వాచ్‌మెన్‌లను నియమించుకోవాలి. కమిటీలు వేసుకుని రాత్రిళ్ల పహారా కాచేలా చూసుకోవాలి.
- కొత్తవ్యక్తుల కదలికలపై 100కు, వాట్సాప్ 9490617444నెంబరుకు సమాచారం అందించాలి.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి



సాధారణ రోజుల్లో కంటే పండుగ సెలవుల సందర్భంగా దొంగతనాలు జరగడానికి ఆస్కారం ఎక్కువ ఉంటుంది. పండుగ కోసం ఊర్లెళ్లే వారు విలువైన వస్తువులను భద్రపర్చుకోవడం మంచిది. ఎక్కువ రోజులు వేళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడం వల్ల పెట్రోలింగ్ నిర్వహించి నిఘా ఏర్పాటు చేస్తాం.

– పింగళి నరేష్‌రెడ్డి, బాలానగర్ ఏసీపీ

కార్పొరేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- 8 చెరువుల అభివృద్ధికి రూ.22 కోట్లు,
- 5 పార్కుల సుందరీకరణకు రూ.10కోట్ల నిధులు
- ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్ : మౌలిక వసతుల కల్పనలో నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్‌సింగ్‌లతో కలిసి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంజీరా నీటి నిర్వహణ, బిల్లులు, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, చెరువుల అభివృద్ధి పనులతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదకొండేళ్లలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ కార్పొరేషన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే చేపట్టి, పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 8 చెరువుల అభివృద్ధికి రూ.22 కోట్లు, 5 పార్కుల సుందరీకరణకు రూ.10కోట్లు కేటాయించడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభించాలన్నారు. శ్మశాన వాటికల అభివృద్ధికి, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.


సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

బీవీఆర్ఐటీ విద్యార్థినులకు హిటాచీ ఎనర్జీ స్కాలర్‌షిప్


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న అతిథులు

నిజాంపేట్: బీవీఆర్ఐటీ బాచుపల్లి కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 8 మంది విద్యార్థినులు హిటాచీ ఎనర్జీ స్కాలర్‌షిప్ పొందారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా విద్యార్థినులకు ఒక ల్యాప్‌టాప్, ప్రతి సంవత్సరం రూ.20 వేల ఆర్థికసాయం, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గురువారం కళాశాలలో జరిగిన ల్యాప్‌టాప్ పంపిణీ కార్యక్రమంలో హిటాచీ ఎనర్జీ ఇండియా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అకిలూర్ రెహమాన్ మాట్లాడుతూ.. మహిళా ఇంజినీర్ల భాగస్వామ్యం ఇంధన రంగ అభివృద్ధికి కీలకమన్నారు. విద్యార్థినుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి హిటాచీ ఎనర్జీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం వైస్ ప్రెసిడెంట్ (సీఎస్ఆర్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఎక్సలెన్స్) మోహన్ కక్డే బెంగళూరు నుంచి లైవ్‌లో విద్యార్థినులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో హిటాచీ ఎనర్జీకి చెందిన ఎస్.ఎన్.ఎస్.మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.సునీత, శిక్షణ ఫౌండేషన్ సీనియర్ డైరెక్టర్ రమానందనవనం, డాక్టర్ బి.శ్రీనివాసరావు, కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ గురుస్వామి రేవణ, శిక్షణ ఫౌండేషన్ సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్ కాశీనాథ్ నటికర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

దుండిగల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా పీఏసీఎస్ పని చేస్తుందని భౌరంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మిద్దెల్ల బాల్‌రెడ్డి అన్నారు. గురువారం భౌరంపేట్ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం, వ్యయం, ఆస్తి, అప్పులు తదితర విషయాలపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ రూ.51.91 లక్షల లాభాన్ని ఆర్జించిందని, రైతులకు రుణాలు అందించడంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. త్వరలో దుండిగల్‌లో ప్యాడీ ప్రొసీక్యూర్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. సంఘ కార్యదర్శి సయ్యద్ అసదుల్ల సంఘం పరిపాలన నివేదిక, కార్యకలాపాల వివరాలను చదివి వినిపించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వెంకటేష్, డైరెక్టర్లు భీంరెడ్డి, దప్పు కిష్టయ్య, మహిపాల్ రెడ్డి, పద్మావతి, ఇంద్రసేనా రెడ్డి, ఈదులకంటి యాదయ్య, పోచమ్మ, ఆరకలి జీతయ్య, మోహన్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి

అభివృద్ధి పనులకు ఎల్లవేళలా సహకారం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: అభివృద్ధి విషయంలో తన సహకారం ఎప్పుడూ ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 120 గజాల కాలనీ – దుల్లపల్లిలో సీసీ రోడ్డు పూర్తిగా పాడైన విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.12 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. గురువారం సదరు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గ పరిధిలో ఏ సమస్య నెలకొన్నా తన దృష్టికి తీసుకురావాలని, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్ , పాక్స్ చైర్మన్ రాజు, పాక్స్ డైరెక్టర్ దప్పు నరేంద్ర, ప్రసాద్, నాగరాజ్ యాదవ్, మోహన్ రావు, శివాజీ, పూర్ణచందర్ రావు, గోపాల్ రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

అంబేడ్కర్ భవన పరిశీలన

దుండిగల్ మున్సిపల్ బహదురుపల్లి ఎస్సీ బస్తీలో శిథిలమైన అంబేడ్కర్ భవనాన్ని హన్మంతరెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి భవనానికి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దుడ్డు నర్సింగరావు, జనరల్ సెక్రటరీ కొమ్ము బిక్షపతి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, నాయకులు నాగభూషణం, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

నాలా నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

కుత్బుల్లాపూర్: కలెక్టర్ మనుచౌదరిని గురువారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కొంపల్లి పరిధిలో మొగుళ్ల కుంట చెరువు, ఊర చెరువుల నుంచి ఫాక్ సాగర్‌కు నాలా లేకపోవడం భారీ వర్షాలు పడ్డ ప్రతిసారి అపర్ణ పార్క్, గణనంద, ఆదిత్య పార్క్, నూజివీడు సీడ్స్ ముంపునకు గురవుతున్నాయని శ్రీశైలంగౌడ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆయనతో పాటు పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జెమ్మి దేవేందర్ ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

వంట చేసి.. విద్యార్థులకు వడ్డించి


పాఠశాల విద్యార్థులకు వడ్డిస్తూ..


కూరగాయలు కోస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: ఇంజినీరింగ్ విద్యార్థులంటేనే లైఫ్ స్టైల్ స్టార్ట్.. పాష్ కల్చర్.. ఫ్రెండ్స్‌తో చిట్ చాట్.. స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేసే వయస్సు.. కానీ అందరి లాగా తాము కాదని నిరూపించారు కండ్లకోయ సీఎంఆర్ కళాశాల విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి గడిపే క్షణాలనే తమ మధురానుభూతులను భావించి విద్యార్థులతో ఆడి పాడారు. ఎల్లంపేటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వండి వారికి కడుపు నిండా వడ్డించి ఆనందం పొందారు. ఎఎస్ఎస్(నేషనల్ సర్వీస్ స్కీమ్) ఏర్పాటు చేసి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎఎస్ఎస్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తైన సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సహపంక్తి భోజనం చేశారు.

జీడిమెట్ల డీఐ కనకయ్య బదిలీ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య బదిలీ అయ్యారు. కనకయ్య ఆర్‌జీఐఏ ఔట్ పోస్ట్ ఎస్‌హెచ్‌ఓగా పదోన్నతి పొందగా ఆయన స్థానంలో రాయదుర్గం పీఎస్‌లో డీఐగా పని చేస్తున్న సీహెచ్. ధనుంజయ జీడిమెట్లకు బదిలీపై వచ్చారు. అదేవిధంగా జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ షాద్‌నగర్ రూరల్ లా అండ్ ఆర్డర్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తూరు సీఐ నరసింహారావు ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని సైబరాబాద్ కమిషనర్ పేర్కొన్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి


అలీ(ఫైల్)

కుత్బుల్లాపూర్: దాడిలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. ఈ నెల 18న దుర్గం శ్రీకాంత్ గౌడ్ తన స్నేహితుడు అలీ, రాజుతో కలిసి స్థల విషయంలో ఆనంద్‌తో గొడవ జరిగింది. ఈ ఘటనలో ఆనంద్ వారిపై ఇనుపరాడ్లతో దాడి చేయగా శ్రీకాంత్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అలీ గత వారం రోజులుగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతు గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు దూలపల్లిలో నివాసమంటూ బహదూర్ పల్లిలో చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చింతలకుంట చెరువు వద్ద స్వచ్ఛతా హీ సేవ

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పరిధిలో గురువారం స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దొమ్మర పోచంపల్లిలోని చింతలకుంట చెరువు వద్ద చెత్తాచెదారాలను తొలగించారు. చెరువులు కుంటలు వద్ద చెత్త పారబోయవద్దని, సింగిల్ ప్లాస్టిక్ వాడవద్దని, సింగల్ ప్లాస్టిక్ వాడిన వారిపై ప్లాస్టిక్ బ్యాన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎన్విరానిమెంట్ ఇంజనీర్ సాత్విక్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ నగేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభాష్, వార్డ్ ఆఫీసర్స్, మహిళా గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి


మొక్క నాటుతున్న జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి


ఉషోదయ టవర్స్‌లోని పార్టీ కార్యాలయంలో..

జగద్గిరిగుట్ట : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109 జయంతిని గురువారం ఆయా డివిజన్‌లలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ తత్వాన్ని దేశానికి అందించిన మహానుభావుడని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సనాతన ధర్మాన్ని వ్యాప్తి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.


నిజాంపేట్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

నవరాత్రి ఉత్సవాలు.. కాత్యాయనిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవార్లకు కాత్యాయనిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు, దుర్గామాత మండపాల వద్ద జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– రంగారెడ్డినగర్


చిత్తారమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో కూన జగన్‌గౌడ్, శకుంతల దంపతులు


రంగారెడ్డినగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలో పాల్గొన్న భక్తులు


సుచిత్రలోని దుర్గామాత పూజలో..


జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో..


శ్రీకాత్యాయనిదేవి అలంకరణలో చిత్తారమ్మ


మగ్దూమ్‌నగర్‌లో ..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029